కథానిక

# రూపాజీవ రసజ్ఞత

పురాణం సుబ్రహ్మణ్య శర్మ

వారాంగన 'మంజుఘోష' ప్రాంగణాన, నూతనంగా ఎన్నడు-మున్నెన్నడూ లేనిది, 'ఈయిల్లు అద్దెకు' అనే ప్రకటన వ్రేలాడతీయబడి వుంది. క్రింద ఆశ్చర్య జనకంగా-'సంసారులకు మాత్రం'-అని చిన్న పొడి అక్షరాలతో వ్రాయబడి వుంది.

సరిగ్గా - వ్రేలాడుతూన్న యీ ప్రకటనకు ఐదడుగుల అధోభాగంలో వున్న అరుగుమీద 'పూర్వాశ్రమాన్ని' నెమరుకు తెచ్చుకుంటూ 'మంజుఘోష' మాతృశ్రీ, వొంటిమీద యీగల్ని దులుపుకుంటూ పాప పంకిల మైపోయిన తన కోమలేతరదేహాన్ని గోడకానిచ్చి పై ప్రకటన గూర్చి బాటవెంట వచ్చేవారితో, పొయ్యేవారితో అభిభాషణలు సలుపుతూ వుంది. ఉదయం ఎనిమిదిగంటల వేళ ఎవరెవరో అడుగారు ఏమిటీ వింత-అని. 'మంజుఘోష' తల్లి మాత్రం ఖేదజనకంగా 'కూతురికి పుట్టిన బుద్ధి' అనీ 'అది తనమాట వినదనీ—యీ పుట్టిన బుద్ధి పుడకలతో గాని, అని కూడా వాక్రుచ్చింది. అరుగుమీదకు ఎండ పాముకుని వస్తూన్న కారణాన, ముసిలిది లేచి చోటు మార్చుకుంటూన్న సమయాన, ఎవరో వచ్చి 'ఈ యిల్లు యిప్పుడు చూడవచ్చునా?' అని ప్రశ్నించారు. ముసిలిది ఎవరని పరకాయించకుండానే, 'మీరు సంసారులేనా?' అని తిరిగి ప్రశ్నించింది.

'ఆహా!' అన్నాడు వచ్చినతను.

'ఎంతమంది పిల్లలు?'

'ఆ వచ్చినతను నవ్వుకుంటూ క్రొత్త కాపురం మాది, ఇదే యీవూరు రావటం' అన్నాడు. ముసిలిది యింతకన్నా మీకు మరోచోటు దొరకలేదా దిగటానికని అనుకుంటూ-ఎదురు ప్రశ్న వేసింది,

'మరైతే ఆవిడ్నికూడా తీసుకురాలేక పోయారూ యిల్లు చూడ్డానికి?'

'ఇల్లు చూసిన తరువాత యిల్లాలిని తీసుకవద్దామనీ' అన్నాడు మందహాసంతో. ముసిలిదాని పరీక్ష పూర్తికాలేదు యింకా.

'ఒకవేళ ఆవిడకి యిక్కడ యిష్టం లేకపోతే...' అతను బెదరకుండా-'అటువంటి దేం వుండదు' అన్నాడు. ముసిలిది అందుకుంది. 'ఈ కాలపు సంసారులు, సానివాండ్ల కన్నా గడసరులు. తీరా అన్నీ అమర్చుకున్నాక ఆమె వద్దంటే—?'

ఈ సందేహాన్ని ముసిలిది అంతసామాన్యంగా వదలదు గనుక, అతను ముసలిదాన్ని తృప్తిపరచే నిమిత్తం ఒకఎత్తు ఎత్తాడు.

'అన్ని సంసారాల మాట నాకు తెలీదుగాని నా సంసారంమాత్రం నామాటమీద. పెద్దవిషయాల్లో ఏమోగాని, యిటువంటి చిన్నచిన్నవిషయాలకు అడ్డుచెప్పదు. ఇంతకన్నా నేనేం పూచీకత్తు యివ్వగలను?' ముసిలిది వెంటనే తమాయించుకుని -

'అల్లామెట్లు ఎక్కి పైకి వెళ్ళండి. మా అమ్మాయి వుంటుందక్కడ. దాన్తో మాట్లాడొచ్చు మీరు' అంది. అతను యీ అవకాశాన్ని పురస్కరించుకుని యిక ముసలిదాన్తో నిమిత్తం లేనట్టు చకచక ముందుకు సాగి, మెట్లమీదుగా 'మంజుఘోష' నిలబడి చదువుకుంటూన్న పరిస్థితిలో గుమ్మం ఎదుట ఏమని పలకరించటమో? అని సందిగ్ధావస్థలో యిదమిద్ధం తేల్చుకోలేక యిటు అటు దిక్కులు చూడ్డం సాగించాడు.

అతనికి ఎదుటనే ఆమె వుంది. అయినప్పటికీ అతనికామె ముఖబింబాన్ని పరిశీలించే అవకాశం లేదు. ఎందువల్లనంటే ఆమె చేతిలోని పత్రిక ఆమె ముఖ భంగిమాల్ని లెక్కబెడుతోంది. అతను మెటికె విరిచాడు. చిటిక్కుమని చప్పుడయింది. ఆమె తలకాయ ఎత్తి చూచింది.

'ఎవరు మీరు?'

'మీదేనా యీ యిల్లు...'

'అవును. ఇలా వచ్చి కూర్చోండి'

'అద్దెకు వాటా వున్నదటగా. నా పేరు పార్థసారథి'

'సంసారులకు గాని యివ్వ దలచుకోలేదు. మీరు సంసారంతో వచ్చివుంటే మాకేం అభ్యంతరంలేదు.'

ఈ సంభాషణ అతిక్లుప్తంగా ముగియటాన్ని బట్టి చూస్తే 'మంజు ఘోష' పార్థసారథి, సంసారి అవునా కాదా అని అనుమానిస్తోందని తెల్లమవుతోంది. పార్థసారథి మందహాసంతో,

'వాటా చూపిస్తారా?' అన్నాడు.

కువలయాక్షి భృకుటివిక్షేపం గావిస్తూ పెంకెగా

'సంసారి నని మీరు నిరూపిస్తారా?' అంది.

మంజుఘోష వక్త్రి మంజుఘోష కాదనీ, దాన్ని వలలో కీడ్వడానికి అనమానమైన ప్రతిభ అవసరమని తన బుద్ధి సూక్ష్మత వలన గ్రహించుకున్న పార్థసారథి రణపెంకెగా——

'మంజుఘోషవారాంగనా' వీరాంగనా?' అన్నాడు.

చంచలాక్షికి అతడు త్రొక్కిన దోవ అర్థమయింది. ఆ త్రోవనుంచి అతన్ని వెనక్కి తరమాలంటే- తను ఎందువలన సంసారులకేగాని యివ్వనందో తెలియబర్చాలి - విషయం విప్పి చెబితే తను ఓడిపోయినట్టే అవుతుందా కాదా మరి... అందువలన విధిలేక వారాంగనముందు లేచి పార్థసారథికి వ్రేలికొనగోట సంజ్ఞా మాత్రంగా అంగీకారాన్ని సూచించి 'ఇల్లు చూడాలన్నారుగదా!' అంది నడుస్తూ. ఏ మాత్రం తన్ను లక్షించకుండా 'అవును.' అన్నాడా సంసారి క్లుప్తసరిగా అనుసరిస్తూ.

'ఎన్నాళ్లు ఉండదలిచారు?' మెట్లు దిగుతూ అన్నదామె.

'ఎక్కడ? యీ ఊర్లోనా మీదేనా...'

మంజుఘోష గుండెలన్నీ విప్పి నవ్వింది. కోమలమైన ఆమె ముఖంలోని కండరాలన్నీ విచ్చుకున్నాయి. అతడుమాత్రం వంచిన తల ఎత్తలేదు.

'ఈ ప్రపంచంలో ఎన్నాళ్లు వుండ దలిచారో నేను అడగలేదు. ఈ యింటిలో ఎంతకాలం సుమారుగా వుంటారు? అసలు మీ వుద్యోగం?'' ఈవివరాలన్నీ 'మంజుఘోష'కు కావాలి.

అతను కేవలం నిర్వికారంగా- 'కనీసం రెండు మూడు నవలలు పూర్తయేదాకా వుంటాను.'

'పార్థసారథి' నిశ్చలమైన తత్వాన్ని అర్థం చేసుకోటానికి 'మంజుఘోషకు' చాలాకాలం పట్టేటట్లుంది. ఆమె అతణ్ణి వెంటవేసుకొని అదీ యిదీ చూపిస్తూ-''ఈ గది మీకు నవల్లు వ్రాసుకోటానికి బాగ ఉపకరిస్తుం దనుకుంటాను.'' ఏమంటారు అన్నట్లు చూచింది అతనివంక——

''అవును - ఏకాంతంగా ఆలోచించటానికి, మధ్యమధ్యన కిటికీ తలుపులు తెరచి అటూయిటూ చూస్తూవుండటానికి-బాగుంటుంది-''

ఆమెకు మనస్సులో అతణ్ణి బెల్లించి సంసారి అవునా కాదా కూపీ తియ్యాలని వుంది. సంసారులపొరుగు దానికేల కావలసివచ్చిందో తెలుసుకోవాలని అతను ఆరాటపడుతున్నాడు. 'మంజుఘోష' యింటి సౌకర్యాల్ని ఏకరువు పెడుతూ—'మీరు ఫలానాచోట వంట చేసుకోవచ్చును. మీ వాళ్లు ఫలానాచోట స్నానం య్యొచ్చు-' అంటూ దొంగతనంగా అతని ముఖభంగిమాల్ని వీక్షించింది. అందులో యించుకంత 'నవ్వు-హాస్యం' ద్యోతకమయినట్లు కనిపించిందామెకు. అది కనిపట్టి అతను——

'ఆవిడకు వంటచెయ్యటం ఆసలే రాదు. మాకు హోటలు భోజనమే గతి.'

అబద్ధమాడుతున్నాడేమో అని అనిమిషహరిణేక్షణ- పొంచిపొంచి అతని లోకి చూస్తోంది. ఆమె అట్లా ఆరాటపడటం అతని కత్యంత ఆమోదదాయకంగా వుంది,

'ఆయితే అద్దెమాట ...' అన్నాడు. 'మంజుఘోష' వినిపించీ వినిపించుకోనట్టుగా- అంది.

'అది నిమిత్తమాత్రమే. మీరు యివ్వగలిగినంత. సరేనా ?'

'అద్దె నిమిత్త మాత్రమేగనుక, మేము రేపే వచ్చి చేరతాం. చేరిన తరువాత చూసుకోవచ్చు అన్ని విషయాలూ. ముఖ్యంగా ముందు నాకు వాటా ఖాళీచేసి యివ్వాలి' అంటూ త్వర పడ్డాడు పార్థసారథి.

మంజుఘోష విస్తుబోయింది.

నిజంగా ఆమె కర్థంగాని వ్యక్తిత్వం అతనిది. వేస్తాడనుకున్న ప్రశ్న అతను వెయ్యలేదు. అది అలావుంచి- తను సంసారిపొరుగు ఆపేక్షించింది ఎందుకో కూడా తెలుసుకోవాలనే కాంక్ష అతనిలో వున్నట్టు లేదు. ఇదివరకు వున్నదేమో, యిప్పుడు లేదు. నిజంగా మంజుఘోష ఆలోచనలో పడింది. ఇటువంటి సంసారిపొరుగు తనకు ప్రయోజనాన్ని కలిగిస్తుందా? తన జీవితాన్ని కొద్దిగా సంస్కరించ దల్చుకున్న యీ శుభ క్షణాల్లో, రచయితవలె కనిపిస్తున్న- యీ 'పార్థసారథి' సాంసారిక జీవితం తనకు మార్గదర్శక మవుతుందా? ఒకవేళ యితను యీయింట వుంటాననటం మూన్నాళ్ళ ముచ్చట కాదుగదా! అన్ని సందేహాల నుంచీ తెప్పరిలిన ముఖంతో, ప్రశ్న వెయ్యకుండా సమాధానం కోసం ఎదురుచూసే వెఱ్ఱిమనిసిలా కొట్టుమిట్టాడింది... కాగా ఆమెకు పూర్తిగా మెలకువ వచ్చే సరికి పార్థసారథి వీధివాకిలి మెట్లు దిగుతూ- 'వాటా ఖాళీ చేసి యిస్తారు గదూ?' అన్న వాక్యం వినిపించింది. 'ఆహా!' అన్నదామె.

మరునాటి ప్రొద్దు పొడుపువేళ ఒక బండెడు సామానులతో, మరొక బండి మీద సంసారంతో పార్థసారథి! 'మంజుఘోష' వారాంగన అని తెలిసి వున్నప్పటికీ - ఆయింట దిగడాన్ని గూర్చి - వాడలోని కాకులు గోకులలై కూయసాగాయి.

ఈపనిని ఎవ్వరూ హర్షించలేదు. సరిగదా సాటి వారకామినులు సైతం యిదేమి పోగాలమని 'సాని తల్లి'ని మాటలతో పొడిచి పొడిచి వదిలారు. కొందరు, ఆ వచ్చినతను అసాధ్యుడన్నారు. మాస్తూ వుంటే - మంజుఘోష'ను దాని అందాన్నే గాకుండా, ముసిలిది సంపాదించి, కూడబెట్టినవిత్తాన్నే దోచే సమర్థుడన్నారు మరి కొందరు వారకాంతకిప్పుడే సంసారచింత పనికిరాదన్నారు. పనికి వచ్చినా పనికి రాకపోయినా సాని సంసారిగావటం నాగరిక లక్షణ మవుతోంది గనుక, మంజుఘోష కావచ్చునని సూచించారు. ఇన్నీ విన్న ముసిలిది— 'యీనగాచి నక్కలపాలు చేశానన్నట్లు దీని నిప్పుడా సంసార పక్షానికి త్రోలటం తప్పనిసరి తద్దినం' అని మూలిగింది.

ఈలోగా మంజుఘోష తనలో ఒకవింత పరివర్తనాన్ని జొప్పించుకుంది. అత్యధికమైన శ్రమలకోర్చి పెంచుకున్న కేశసంపత్తిని జటలు జటలుగా వదిలేసింది.

ఆ మీదట దువ్వలువలు గట్టలేదు. రక్తవర్ణాంకితమైన, రెండు పట్టుచీరల్ని చుట్టుకొనే అస్తమానమూ తిరిగేది. వైష్ణవికిమల్లే ముఖమండలాన తిరుచూర్ణం తీర్చిదిద్దేది.

హార, కంకణ, కర్ణికాది ఆభరణలన్నీ విసర్జించింది.

నాసిక, కంఠ, పాద, హస్తాదికాలన్నీ బోసిపోగా అలంకారికులు పెదవి విరిచారు ఏమని!—

'మారింది మంజుఘోష విరాగిగా మారింది' అని. ఆమె లక్ష్యం చెయ్యలేదు. ఆమె చూపు కూడా మారిపోయింది - వారాంగనమంజుఘోష అరమోడ్పు దృష్టిలో ఒకే ఒకసమస్య యిప్పుడు ప్రస్ఫుటంగా గోచరిస్తూన్నది- అటూ - యిటూ ఊగులాడుతున్న దీ యిది - పురుగు పెరిగి, పులుగై అంబరవీధుల్లోకి ఎగరటం ఎలాగ? అక్కడ ఱెక్కలల్లార్చుకుంటూ విహరించటానికి 'మానవి' కి వీలు వుందా?' దీనికోసం సంసారిక వాతావరణాన్ని ఏరికోరి సంపాదించుకుంది మంజుఘోష.

* * *

పార్థసారథి వద్దంటూన్నా వినకుండా అత్తవారు కూతుర్ని అతడితో పంపించివేసి- అల్లుడు బట్టిన కుందేటికి కాళ్ళను తిరిగి లెక్కబెట్టుకున్న వారయ్యారు. 'నేను ఫలానా వూరు పోయి నవలలు రాసుకోవాలనుకుంటున్నాను' అన్నాడతను. 'ఆ ఫలానా వూరే దీన్నికూడా వెంటబెట్టుకుని పొమ్మ'ని మామగారు సూచించారు. మంజులమైన ధోరణిలో ప్రాధేయపడుతూ - ఆలి 'నేనూ వస్తానండి.' అన్నది. కద్దనడానికి కతని కధికారంలేదు ఎందువల్లనంటే ప్రతి స్త్రీకీ భర్తని వెన్నంటిపోయే' హక్కువుంది. అది అతను గుర్తించాడు. కాగా ముందువచ్చి యిల్లుకోసం వెతకటంలో మంజుఘోష అనే వారాంగన సంసారులకే ఒకవాటా అద్దెకివ్వ తలచిందని తేలటం, దాన్నే యీ విపరీతవ్యక్తి అపేక్షించడం కథల్లో వ్రాతకందే విషయం గాని, జీవితంలో జరిగేది

కాదు అన్న వారున్నారు. 'పార్థసారథి' యిటువంటి అవకాశాలకోసం వేచివుంటాడు ఎల్లప్పుడూ. అదీగాక యీ తరహా ఆక్షేపణలకు అతీతుడు. ఇల్లాలికి విషయం పట్టలేదు. ఉనికి గూర్చి ఆమెకు ఒకచోట సందేహం రాగా భర్తపజ్జకు చేరి 'ఇదుగో నిజం చెప్పండి. ఈ తల్లీ కూతుళ్ళు ఏ కులస్థులు? మొగదిక్కు ఎవ్వరూ లేరే- మరి సంపాదన ఎవరిది? యింత విరివిగా కర్చుపెట్టటానికి? అసలింతకీ అద్దె ఎంతో చెప్పారు కారు.' అని సణిగింది. అతడు ప్రతి ప్రశ్నకు వరసగా ఒకే సమాధానం యిచ్చాడు-'ఇదిగో ... వైష్ణవికి మళ్లీశ్వరందే ఆ అమ్మాయి-ఆవిడే మంజూఘోష. ప్రస్తుతం హార, కంకణ, కర్ణికాది, ఆభరణాలన్నీ విసర్జించి విరాగి అయింది. పూర్వాశ్రమంలో వారాంగనగా ఆర్జించిన విత్తాన్ని యిప్పుడు కర్చుపెడుతోంది. మన ఖారుగే చాలకుంటూన్న యీమె యింత అద్దె యీయవలసిందని నన్ను కోరలేదు. ఎంత యిద్దామని నీ వూహ?' అన్నాడు చమత్కారంగా. క్రొత్తగా కాపరానికివచ్చిన ఆ పిల్ల సిగ్గుతో ముఖం దించుకుని, 'ఛీ! యిక్కడకా నన్ను తెచ్చి కాపరం పెట్టారు' అంది అసలు కప్పి బుచ్చేవాడికి మళ్లీ పార్థసారథి, 'ఈవూళ్లో యిళ్ళు లభ్యంకావటం తేలికగాదు. తెలుసుకో మ్మన్నాడు నవ్వుతూ.

'ఇటువంటి సిగ్గులేని పనికంటే - సంసారాన్ని లేకపోవటం మంచిది' అన్నదామె బలవంతాన, కనుకొలకులలోనికి నీటి కణాలను ఆహ్వానిస్తూ.

'ఇటువంటి చిన్న విషయాలకు నన్ను అల్లరి బెట్టవని నేను వారిద్దరితోనూ మనవి చేసాను, పొరబాటున' అన్నాడో లేదో,

సరిగా యిదే సమయాన 'మంజూఘోష' పై అంతసునుండి తరంగాలు తరంగాలుగా—

'బాలకృష్ణం కలయ సఖి సుందరం' పాడడం వినవచ్చింది మనోహరమైన స్థాయిలో. పార్థసారథి భార్య ఆతృతగా లేచి లేని నవ్వు తెచ్చుకుంటూ—'ఎంత మంచి గొంతు కంఠీ ఆమెది' అంది.

'అందుకనే ఆమెను నా కథకు నాయికగా తీసుకుంటున్నా' నన్నాడు. తడుముకోకుండా అంది, 'ఐతే మంచిపేరు తెచ్చుకుంటారు మీరు' ఆమె విప్పారిన ముఖాన్ని చూచి, 'అట్లా రావే సంసార పక్షానికి' న్నా డతను.

